తన పుట్టినరోజు సందర్భంగా బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను ఎర్రవల్లిలోని వ్యవసాయ క్షేత్రంలో సోమవారం కలిసి ఆశీస్సులు తీసుకుంటున్న బీఆర్ఎస్వీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డా.తుంగ బాలు

జ్ఞాపక శక్తి నైపుణ్యాలతోనే విజయం

- వేప అకాడమీ ఎండీ సీఎస్ వేప
- 'నమస్తే తెలంగాణ, తెలంగాణ టుడే' ఆధ్వర్యంలో సెయింట్ పీటర్స్‌లో సదస్సు



సదస్సులో మాట్లాడుతున్న వేప అకాడమీ ఎండీ సీఎస్ వేప

మేడ్చల్, జూన్ 10: జ్ఞాపకశక్తి నైపుణ్యాలను పెంచుకుంటే జీవితంలో విజయం తథ్యం అని వేప అకాడమీ ఎండీ సీఎస్ వేప అన్నారు. చదువులో విజయం సాధించడానికి మేధాశక్తిని ఎలా వినియోగించాలి? అనే అంశంపై 'నమస్తే తెలంగాణ, తెలంగాణ టుడే' ఆధ్వర్యంలో గుండ్ల పోచంపల్లి మున్సిపాలిటీ మైసమ్మగూడలోని సెయింట్ పీటర్స్ ఇంజినీరింగ్ కళాశాలలో సోమవారం సదస్సు జరిగింది. ఈ సదస్సులో ప్రధాన వక్తగా పాల్గొన్న సీఎస్ వేప మాట్లాడుతూ, మేధాశక్తిని సరియైన విధానంలో వినియోగిస్తే కష్టతరమైన విషయాలను కూడా సులువుగా అర్థం చేసుకోవచ్చన్నారు. మేధాశక్తి వినియోగానికి జ్ఞాపక శక్తి నైపుణ్యాలపై పట్టు సాధించాలని సూచించారు. కొన్ని టెక్నిక్స్‌ను వినియోగించడం ద్వారా విషయ పరిజ్ఞానంపై ఫోకస్ పెరుగుతుందన్నారు. ప్రతి వ్యక్తి తమకు ఉన్న మేధాశక్తిలో అతి తక్కువగా వినియోగిస్తున్నారని తెలిపారు. అందువల్లే విషయ పరిజ్ఞానంపై పట్టు సాధించలేక జీవితంలో వైఫల్యం చెందుతున్నారన్నారు. విద్యార్థులు ఈ నైపుణ్యాలను ఎంతగానో ఉపయోగపడుతాయని తెలిపారు. ఈ సందర్భంగా సీఎస్ వేప ప్రపంచ వ్యాప్తంగా ప్రాచుర్యంలో ఉన్న వివిధ రకాల జ్ఞాపక శక్తి నైపుణ్యాలను విద్యార్థులకు వివరించారు. వాటిని వినియోగం ద్వారా తక్కువ సమయంలో విషయ పరిజ్ఞానంపై పట్టు సాధించవచ్చనే విషయాన్ని కూలకశంగా వివరించారు. కళాశాల కార్యదర్శి టీవీ రెడ్డి మాట్లాడుతూ ఒక విషయం గుర్తు ఉండటానికి, ఉండకపోవటానికి ప్రధాన కారణం దృష్టి పెట్టకపోవడమే అన్నారు. ఏ విషయం అయినా, ఏ వ్యక్తి అయినా ప్రభావం చూపితే ఆ విషయం జీవితాంతం గుర్తుండి పోతుందన్నారు. ఆంగ్ల పదాలు లిజనింగ్, హియరింగ్‌కు తేడా ఉందని తెలిపారు. హియరింగ్ అంటే శబ్దాన్ని వింటాం కానీ, దాన్ని గుర్తుంచుకోలేమని తెలిపారు. శ్రద్ధతో విన్న విషయం తప్పకుండా గుర్తు ఉంటుందని చెప్పారు. విద్యార్థులు తమ పాఠ్యాంశాలపై దృష్టి పెడితే తప్పకుండా పట్టు సాధించగలుతారని చెప్పారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులతో మాట్లాడుతూ పూర్వ ప్రాథమిక విద్య, ప్రాథమిక విద్యను అభ్యసించే సమయంలో గుర్తున్న క్లాస్ టీచర్ల పేర్లు, స్నేహితులు పేర్లు, ఘటనల గురించి అడిగి తెలుసుకున్నారు. దాదాపు 16 ఏండ్ల తర్వాత అప్పటి విషయాలు గుర్తున్నాయంటే వాటి ప్రభావం ఎంతగా ఉందో గుర్తుంచాలన్నారు. విద్యార్థులు ప్రముఖ నిపుణుడు సీఎస్ వేప అందించిన నైపుణ్యాలను చదువులో అమలు చేయాలని ఆయన సూచించారు. కళాశాలలో విద్యార్థులు ఎదగడానికి కావాల్సిన అన్ని రకాల అవకాశాలు, శిక్షణలు ఇస్తున్నామని తెలిపారు. అందులో భాగంగానే 'నమస్తే తెలంగాణ, తెలంగాణ టుడే' ఆధ్వర్యంలో జ్ఞాపక శక్తి నైపుణ్యాలపై అవగాహన సదస్సు నిర్వహించినట్టు చెప్పారు. ప్రిన్సిపాల్ శ్రీలత మాట్లాడుతూ సదస్సు ద్వారా నేర్చుకున్న విషయాలను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అవగాహన పొందిన విషయాలను చదువులో అమలు చేయడంతో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని సూచించారు. యువత తన మేధాశక్తి పూర్తి స్థాయిలో వినియోగిస్తే అద్భుతాలు సాధించే అవకాశం ఉంటుందని చెప్పారు. ఆ దిశగా పయనించి, లక్ష్యాన్ని ఛేదించాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌వోడీ సరిత, తెలంగాణ పబ్లికేషన్ ఇనిస్టిట్యూషన్ మేనేజర్ గణేశ్, ఏసీఎం కేఆర్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం సీఎస్ వేపను కళాశాల కార్యదర్శి టీవీ రెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీలత జ్ఞాపికతో ఘనంగా సన్మానించారు.

విద్యార్థులకు ఉపయోగకరం

వేప అకాడమీ ఎండీ సీఎస్ వేప విద్యార్థులకు కల్పించిన విషయాలు ఎంతో ఉపయోగకరం. చాలా మంది విద్యార్థులు చదువులో వెనుకబడిపోవటానికి ప్రధాన కారణం మేధాశక్తిని సరియైన విధానంలో వినియోగించకపోవడం, ప్రణాళిక లేకపోవడం. లక్ష్యాన్ని సాధించాలంటే ఇంజినీరింగ్‌లో చేరిన మొదటి ఏడాది నుంచే ప్రణాళిక బద్ధ కృషి, విషయ పరిజ్ఞానంపై పట్టు సాధించే సమయంలో జ్ఞాపశక్తి నైపుణ్యాలు అవసరం. సీఎస్ వేప అందించిన నైపుణ్యాలు, అవగాహన కల్పించిన అంశాలు ప్రభావవంతంగా ఉన్నాయి. విద్యార్థులకు విలువైన విషయాలపై కళాశాలకు వచ్చి అవగాహన కల్పించిన సీఎస్ వేపకు ప్రత్యేక కృతజ్ఞతలు.

– టీవీ రెడ్డి, కార్యదర్శి
సెయింట్ పీటర్స్ ఇంజినీరింగ్ కళాశాల

నీట్‌పై విచారణ జరిపించాలి : ఏఐవైఎఫ్

హిమాయత్‌నగర్ వై జంక్షన్‌లో సుబోధ్ కుమార్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న ఏఐవైఎఫ్ నేతలు

హిమాయత్‌నగర్, జూన్ 10: నీట్ పేపర్ లీకేజీపై సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జిచే విచారణ జరిపించాలని ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ధర్మేంద్ర, రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు ఎన్.శ్రీకాంత్ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఏఐవైఎఫ్ రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో హిమాయత్‌నగర్‌లోని వై జంక్షన్‌లో నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ డైరెక్టర్ జనరల్ సుబోధ్ కుమార్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇటీవల ప్రకటించిన నీట్ పరీక్ష ఫలితాల్లో కొంతమందికి 720కి, 720 మార్కులు పొందారని, ఇంత పెద్ద సంఖ్యలో విద్యార్థులు ఎలా మార్కులు సాధించారు? అనే దానిపై వివాదం నెలకొందన్నారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ నాయకులు షేక్ మహమూద్, మాజీద్, కల్యాణ్, అనిల్, షబీనా, పూజ, కిరణ్మయి, నేహా, మురహరి పాల్గొన్నారు.

నీట్ అవకతవకలపై విచారణ జరపాలి..

మేడ్చల్/చర్లపల్లి/హిమాయత్‌నగర్, జూన్ 10: నీట్ అవకతవకలపై సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరపాలని ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి ప్రసాద్, ఎస్ఎఫ్ఐ మేడ్చల్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాథోడ్ సంతోష్ డిమాండ్ చేశారు. ఈసీఐఎల్ అంబేద్కర్ విగ్రహం వద్ద ధర్నా, ర్యాలీ నిర్వహించిన వారు మాట్లాడుతూ నీట్ ఫలితాలు ముందుగా విడుదల కావడం..ఎంబీబీఎస్, బీడీఎస్ ప్రవేశ పరీక్షలో 67 మంది విద్యార్థులకు 720 మార్కులకు 720 పొందడం వివాదంగా మారిందన్నారు. అలాగే, హర్యానాలో ఒకే గదిలో పరీక్ష రాసిన ఎనిమిది మంది విద్యార్థులకు 720 మార్కులు రావడం చూస్తే ప్రశ్నాపత్రం లీకై ఉండాలి. లేదా.. మాస్ కాపీయింగ్ జరిగిందన్న అనుమానం వ్యక్తం చేశారు. పరీక్షకు ముందు ఎన్‌టీఏ ప్రచురించిన మార్గదర్శకాల్లో ఎక్కడా కూడా గ్రేస్ మార్కులను ప్రస్తావించలేదన్నారు. నీట్ పరీక్షపై ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నందున సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలన్నారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు శేఖర్, నేతలు రమ్య, భవిత, మధురిమ, కీర్తన, భారత్, నగేశ్, విద్య పాల్గొన్నారు.

– నీట్ ఫలితాలపై విద్యార్థుల తల్లిదండ్రులకు అనేక అనుమానాలు ఉన్నాయని, వాటిపై విచారణ జరిపించి విద్యార్థులకు న్యాయం చేయాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి టి.నాగరాజు, నగర అధ్యక్షుడు లెనిన్ గువేరా, నగర కార్యదర్శి అశోక్ రెడ్డి కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ సోమవారం నారాయణగూడ చౌరస్తాలో నిరసన చేపట్టారు.

ఫలితాలు విడుదల

ఉస్మానియా యూనివర్సిటీ, జూన్ 10: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని వివిధ కోర్సుల పరీక్షా ఫలితాలను విడుదల చేసినట్లు ఓయూ పరీక్షల విభాగం, కంట్రోలర్ ప్రొఫెసర్ రాములు తెలిపారు. బీపీఈఈడీ, డీపీఈఈడీ మొదటి, మూడో సెమిస్టర్ రెగ్యులర్, ఎంఈఈడీ స్పెషల్ ఎడ్యుకేషన్, బ్యాచ్‌లర్ ఆఫ్ ఫ్యాషన్ టెక్నాలజీ, పీజీడీ సీయూఎల్ కోర్సుల పరీక్షా ఫలితాలను విడుదల చేశామని చెప్పారు.

వాల్యుయేషన్‌కు దరఖాస్తులు

ఓయూ పరిధిలోని ఎంఏ లాంగ్వేజెస్ కోర్సుల పరీక్షా ఫలితాలపై ఛాలెంజ్ వాల్యుయేషన్‌కు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. ఎంఏ లాంగ్వేజెస్ మొదటి, మూడో సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షా ఫలితాలను ఇప్పటికే విడుదల చేశామని చెప్పారు. ఈ ఫలితాలపై అనుమానం ఉన్నవారు ఒక్కో పేపర్‌కు రూ.10,000 చొప్పున చెల్లించి, ఈ నెల 20వ తేదీలోగా తమ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. జవాబు పత్రాల నకలు పొందగోరేందుకు ఒక్కో పేపర్‌కు రూ.1,000 చొప్పున చెల్లించి ఈ నెల 25వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు.

జేఎన్టీయూహెచ్ ప్రొఫెసర్లకే.. ప్రాధాన్యమివ్వాలి

బాలానగర్, జూన్ 10: తెలంగాణలోని యూనివర్సిటీల వీసీల నియామకాల్లో జేఎన్టీయూహెచ్ ప్రొఫెసర్లకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని గవర్నర్‌కు, ముఖ్యమంత్రికి లేఖ ద్వారా తెలిపినట్లు జేఎన్టీయూహెచ్ జేఏసీ చైర్మన్ బొట్ల బిక్షపతి పేర్కొన్నారు. జేఎన్టీయూహెచ్ యూనివర్సిటీ వీసీ పదవిని జేఎన్టీయూహెచ్ తెలంగాణ ప్రొఫెసర్లకు మాత్రమే ఇవ్వాలని కోరారు.

పురస్కారాలకు దరఖాస్తులు

సిటీబ్యూరో, జూన్ 10(నమస్తే తెలంగాణ): మలేషియా అంతర్జాతీయ ప్రతిభా పురస్కారాలకు దరఖాస్తు చేసుకోవాలని ఫెడరేషన్ ఆఫ్ ఎన్నారై కల్చరల్ అసోసియేషన్ మలేషియా శాఖ వెల్లడించింది. నగరంలోసోమవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో హైదరాబాద్‌లోని ఫెడరేషన్ బ్రాంచ్ కార్యాలయంలో సంస్థ వ్యవస్థాపక అంతర్జాతీయ అధ్యక్షుడు డాక్టర్ మిరియాల జానకిరామ వరప్రసాద్‌మాట్లాడుతూ విద్యా, వైద్యం, వైజ్ఞానిక, విజ్ఞాన సామాజిక, సాంస్కృతిక, సాహిత్య, సాహితీ, సేవా, సినీ, క్రీడా రంగాల్లో నిష్ణాతులైన వారు దరఖాస్తు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు ఫోన్ నం. 96669 10480లో సంప్రదించాలన్నారు.

విద్యార్థులతో చైర్మన్ పద్మనాభయ్య, ఉద్యోగులు

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి

ఖైరతాబాద్, జూన్ 10: విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణించాలని అడ్మినిస్ట్రేటివ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా చైర్మన్ కె.పద్మనాభయ్య అన్నారు. సోమజిగూలోని ఆస్కీలో సోమవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో 2020 నుంచి 2023 వరకు వివిధ పరీక్షల్లో ప్రతిభ చాటిన సుమారు 117 మంది ఉద్యోగుల పిల్లలకు ప్రతిభా పురస్కారాలను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పిల్లలు తమ ఆరోగ్యంపై శ్రద్ధ చూపించాలని, పరిశుభ్రత పాటించాలని సూచించారు. విద్యతో పాటు సృజనాత్మకత పెంపొందించుకొని, క్రీడల్లో రాణించాలన్నారు. ఉన్నత విద్యకు ప్రోత్సాహాన్ని అందించేందుకు ఒక నిధిని స్థాపించడంతో పాటు ఉన్నత చదువుల కోసం రూ.లక్ష చొప్పున అందజేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఆస్కీ డైరెక్టర్ జనరల్, ఇన్‌చార్జి ప్రొఫెసర్ డాక్టర్ నిర్మల బాగ్చి, డీన్ ప్రొఫెసర్ బీవీఎన్ సచేంద్ర, రిజిస్ట్రార్ డాక్టర్ ఓంపాల్ సింగ్, ఆస్కీ ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు హరిహరన్, ఎండీ హస్సన్, ఉపాధ్యక్షులు రేణు ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

వర్షాకాలం.. వచ్చే మూడు నెలలు జాగ్రత్త

- మున్సిపల్ కమిషనర్ల సమావేశంలో జిల్లా కలెక్టర్ గౌతమ్

సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ గౌతమ్

మేడ్చల్, జూన్ 10(నమస్తే తెలంగాణ): వర్షాకాలం సమీపిస్తున్నందున వచ్చే మూడు నెలలు జాగ్రత్తగా ఉండాలని మేడ్చల్ – మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్ మున్సిపల్ కమిషనర్లకు ఆదేశాలు ఇచ్చారు. మేడ్చల్ – మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం మున్సిపల్ కమిషనర్లతో కలెక్టర్ గౌతమ్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వర్షకాల ప్రణాళికలను సిద్ధం చేసి అమలు చేయాలని తెలిపారు. వర్షాకాలంలో ఎమర్జెన్సీ బృందాలను అప్రమత్తం చేసి వరద నివారణకు చర్యలు చేపట్టాలన్నారు. మ్యాన్ హోల్స్, నాలాల పూడిక తీత పనులను ఎమర్జెన్సీ బృందాలు గుర్తించి మున్సిపల్ కమిషనర్లకు సమాచారం అందించాలన్నారు. నాలాల పూడిక తీత పనులను త్వరితగతిన పూర్తి చేసి డ్రైనేజీలను శుభ్రపరచాలన్నారు. చెరువులు ఉన్నచోట ఎఫ్‌టీఎల్ బౌండరీలను ఏర్పాటు చేసి పిల్లర్లు కట్టి పెయింటింగ్ వేయాలని కలెక్టర్ గౌతమ్ సూచించారు. మ్యాన్ హోల్స్‌ను ఎప్పుడు మూసి ఉంచే విధంగా చూడాలన్నారు. వర్షాకాలంలో ప్రజలకు ఇబ్బందులు రాకుండా చూడాల్సిన బాధ్యత అధికారులదేనని అన్నారు. ఈ సమీక్షా సమావేశంలో మున్సిపల్ కమిషనర్లు పాల్గొన్నారు.

పెండింగ్ సమస్యలపై తక్షణమే చర్యలు తీసుకోవాలి

కోఠిలోని డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ డాక్టర్ రవీందర్ నాయక్‌కు వినతి పత్రం అందజేస్తున్న టీఎన్జీవో కేంద్ర సంఘం అధ్యక్షులు మారం జగదీశ్వర్ తదితరులు

సుల్తాన్ బజార్, జూన్ 10: వైద్య ఆరోగ్య శాఖలో దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలపై తక్షణమే చర్యలు తీసుకోవాలని టీఎన్జీవో కేంద్ర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మారం జగదీశ్వర్ ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు ఆయన కోఠిలోని డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ డాక్టర్ రవీందర్ నాయక్‌ను సంఘం సభ్యులతో సోమవారం మర్యాద పూర్వకంగా కలిసి వినతి పత్రం అందజేశారు. అనంతరం, ఆయన మాట్లాడుతూ, వైద్య ఆరోగ్య శాఖలో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగుల బదిలీలు, పదోన్నతుల వంటి సమస్యలు పెండింగ్‌లో ఉన్నాయని అన్నారు. అవసరాల మేరకు క్యాడర్ స్ట్రెంత్ లేకపోవడంతో ప్రస్తుతం విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులకు అదనపు భాధ్యతలను నిర్వహించాల్సి వస్తుందన్నారు. శాఖలో సిబ్బంది కొరత తీవ్రంగా ఉందని, ప్రధానంగా కంప్యూటర్ ఆపరేటర్లు ప్రతి సెక్షన్‌లో ఒకరు ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆయన డీపీహెచ్‌ను కోరారు. దీర్ఘకాలికంగా వైద్య ఆరోగ్య శాఖలో పెండింగ్‌లో ఉన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో టీఎన్జీవో కేంద్ర సంఘం అసోసియేట్ అధ్యక్షులు కస్తూరి వెంకటేశ్వర్లు, ముత్యాల సత్యనారాయణ గౌడ్, కేంద్ర సంఘం సభ్యులు ఇటిక్యాల కొండల్‌రెడ్డి, గోవర్ధన్ రెడ్డి, రవి ప్రకాష్, టీఎన్జీవో డీఎంహెచ్ఎస్ యూనిట్ అధ్యక్షుడు మామిడి ప్రభాకర్, యూనిట్ సభ్యులు హరి, చంద్రశేఖర్, విష్ణువర్ధన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నీట్ ఫలితాల్లో ఆకాశ్ ప్రభంజనం

ఆర్యదీప్ దత్తా, అర్యన్ యాదవ్, ధృవ్ గార్గ్, మానవ్ ప్రియదర్శి, సమిత్ కుమార్ సైనీ

ఇరం ఖాజీ, పలన్సా అగర్వాల్

సిటీబ్యూరో, జూన్ 10(నమస్తే తెలంగాణ): నీట్–2024 ఫలితాల్లో ఆకాశ్ విద్యా సంస్థల విద్యార్థులు సత్తా చాటారు. 720 మార్కులకు గాను 720 మార్కులు సాధించి దేశ వ్యాప్తంగా మొదటి ర్యాంకును సొంతం చేసుకున్నారు. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ నిర్వహించిన నీట్ ఫలితాల్లో 21 మంది ఉత్తమ విద్యార్థులు తమ ఆకాశ్ విద్యార్థులే ఉన్నట్లుగా సీఈవో దీపక్ మెహతా అన్నారు. తల్లిదండ్రుల సహకారం, అధ్యాపకుల కృషి, విద్యార్థుల చూపిన మొక్కవోని దీక్షతో జాతీయ స్థాయి నీట్ ఫలితాల్లోనూ ఆకాశ్ నిలబడిందన్నారు.

ప్రైవేట్, కార్పొరేట్ కళాశాలల చేతిలో కీలుబొమ్మ ఇంటర్ బోర్డు

- మాజీ ఎమ్మెల్యే కాట్రగడ్డ ప్రసూన, టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు పర్లపల్లి రవీందర్

సుల్తాన్ బజార్, జూన్ 10: ఇంటర్ బోర్డు నిబంధనలను తుంగలోకి తొక్కి ఐఐటీ, నీట్, జేఈఈ అకాడమీల పేరుతో జూనియర్ కళాశాలలు నడుపుతున్న ప్రైవేట్ కళాశాలలపై ఫిర్యాదులు అందినా చర్యలు తీసుకోకపోవడానికి కారణం లోపాయికారి ఒప్పందమా? లేక ప్రభుత్వ పెద్దల ఒత్తిడా? అని టీటీడీపీ ఉపాధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్యే కాట్రగడ్డ ప్రసూన, టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు పర్లపల్లి రవీందర్‌లు ప్రశ్నించారు. ఈ మేరకు సోమవారం టీఎన్ఎస్ఎఫ్ ఆధ్వర్యంలో నాంపల్లి ఇంటర్మీడియట్ బోర్డును ముట్టడించారు. ఈ ముట్టడిలో పాల్గొని వారు మాట్లాడుతూ, ప్రైవేట్ కార్పొరేట్ కళాశాలల చేతిలో ఇంటర్మీడియట్ బోర్డు కీలు బొమ్మగా మారిందని దుయ్యబట్టారు. నో ప్రాఫిట్ నో లాస్ పేరుతో సొసైటీపై నడిచే జూనియర్ కళాశాలలో వివిధ రకాల కోచింగ్‌ల పేరుతో లక్షల రూపాయల ఆర్థిక దోపిడీకి గురి చేస్తున్నా ఇంటర్ బోర్డు అధికారులకు ఎందుకు వినిపించడం లేదని వారు మండిపడ్డారు.

హమాలీ కూలీ రేట్లు పెంచాలి

హమాలీ కూలీల రేట్లు పెంచాలని సోమవారం ఎర్రమంజిల్ కాలనీలోని సివిల్ సప్లయిస్ కార్యాలయాన్ని ఏఐటీయూసీ తెలంగాణ రాష్ట్ర సివిల్ సప్లయిస్ హమాలీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో కార్మికులు ముట్టడించారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా తమ రేట్లు పెంచాలని కార్యాలయం ముందు ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.బాల్‌రాజ్ ఆధ్వర్యంలో కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర సివిల్ సప్లయిస్ హమాలీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ వై.ఓమయ్య, ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి టి.సమ్మయ్య, నాయకులు దేవేందర్, జకరయ్య, శ్రీను, నరసింహ పాల్గొన్నారు.

– ఖైరతాబాద్, జూన్ 10

పత్రికా రంగానికి మార్గదర్శి రామోజీ రావు

దివంగత రామోజీరావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సీనియర్ జర్నలిస్టులు

ఖైరతాబాద్, జూన్ 10: తెలుగు జర్నలిజం, పత్రికా రంగానికి ఈనాడు సంస్థ చైర్మన్ దివంగత రామోజీ రావు మార్గదర్శిగా నిలిచారని సీనియర్ జర్నలిస్టులు అన్నారు. ఈనాడు వయోధిక పాత్రికేయులు, సీనియర్ జర్నలిస్టుల ఆధ్వరయంలో సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో రామోజీ రావు సంతాప సభ జరిగింది. సీనియర్ పాత్రికేయులు వల్లీశ్వర్ మాట్లాడుతూ, ఈనాడు దిన పత్రికలో వృత్తిని, వ్యాపారాన్ని కలిపేవారు కాదని, పాత్రికేయ స్వేచ్ఛ ఉండేదన్నారు. ఆ పత్రికలో పని చేస్తున్నామంటే సమాజంలో మంచి గౌరవం ఉండేదన్నారు. మాజీ ఈనాడు పాత్రికేయులు చెన్నయ్య మాట్లాడుతూ, రామోజీ రావు 88 ఏండ్లలో అనేక విజయాలు సాధించారని, ఉన్నత శిఖరాలకు చేరుకున్నారని, పరిపూర్ణమైన జీవితాన్ని అనుభవించారన్నారు. పత్రిక స్థాపించి వేలాది మంది కుటుంబాలకు ఆసరా కల్పించారన్నారు. వినయ్ కుమార్ మాట్లాడుతూ, ఈనాడు పత్రిక పత్రికా రంగానికి ఓ ఫ్యాక్టరీగా నిలిచిందన్నారు. ఏ సంస్థలో చూసుకున్నా ఈనాడు నుంచి వచ్చిన వారే ఉంటారన్నారు. మాజీ పాత్రికేయురాలు జమున మాట్లాడుతూ, ఈనాడు చేరేందుకు తాను ప్రయత్నిస్తున్నప్పుడు మూడు వేల మంది దరఖాస్తులు చేసుకున్నారని, కాని, రామోజీరావు తనను ఎంపిక చేశారని గుర్తు చేశారు. సీనియర్ పాత్రికేయులు పాశం యాదగిరి మాట్లాడుతూ, ఉదయం ఆరు గంటల కల్లా పేపరు పాఠకులకు చేరేలా నూతన ఒరవడిని ప్రారంభించిన ఘనత రామోజీరావుదేనన్నారు. కార్యక్రమంలో ప్రెస్‌క్లబ్ అధ్యక్షులు వేణుగోపాల నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

ఫిట్‌నెస్ లేని స్కూల్ బస్సులపై కఠిన చర్యలు

- ఉమ్మడి రంగారెడ్డి జిల్లా డీటీసీ మామిండ్ల చంద్రశేఖర్ గౌడ్

సిటీబ్యూరో, జూన్ 10(నమస్తే తెలంగాణ): ఈ నెల 12 నుంచి స్కూళ్లు పునఃప్రారంభం కానున్న నేపథ్యంలో విద్యా సంస్థలకు చెందిన వాహనాలకు ఫిట్‌నెస్ తప్పనిసరిగా కలిగి ఉండాలని ఉమ్మడి రంగారెడ్డి జిల్లా డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ మామిండ్ల చంద్రశేఖర్ గౌడ్ తెలిపారు. ఉమ్మడి రంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా 11,922 విద్యా సంస్థల బస్సులు ఉంటే ఇప్పటివరకు కేవలం 8,917 బస్సులు మాత్రమే ఫిట్‌నెస్ సర్టిఫికెట్ పొందాయన్నారు. మిగిలిన 3,005 బస్సులు కూడా సంబంధిత ఆర్టీవో కార్యాలయాల్లో ఫిట్‌నెస్ ధ్రువీకరణ పొందాలన్నారు. 15 ఏళ్లు దాటిన విద్యాసంస్థల బస్సులు ఎట్టిపరిస్థితుల్లో రోడ్లపై తిరగరాదని, ఫిట్‌నెస్ లేని బస్సులలో విద్యార్థులను తరలిస్తే ఆ వాహనాలను సీజ్ చేయడంతో పాటు, యాజమాన్యాలపై కూడా కఠిన చర్యలు ఉంటాయని డీటీసీ హెచ్చరించారు. బస్సు మంచి కండిషన్‌లో ఉంచడంతో పాటు అనుభవజ్ఞులైన 60 ఏండ్లకు మించని డ్రైవర్లను నియమించుకోవాలన్నారు. ఇప్పటివరకు రంగారెడ్డి జిల్లాలో 5,725 బస్సులకు 4,363, మేడ్చల్ మల్కాజిగిరిలో 5,985 బస్సులకు 4,468 బస్సులు, వికారాబాద్ జిల్లాలో 212 బస్సులకు 86 బస్సులు ఫిట్‌నెస్ కలిగి ఉన్నాయన్నారు. త్వరలో విద్యా సంస్థల యాజమాన్యాలు, డ్రైవర్లతో సమావేశం నిర్వహిస్తామని డీటీసీ చంద్రశేఖర్ తెలిపారు.

బోనాల ఏర్పాట్లు ఇంకెప్పుడు?

- ఇప్పటికీ ప్రారంభం కాని గోల్కొండ బోనాల పనులు

మెహిదీపట్నం జూన్ 10: తెలంగాణ రాష్ట్రంలో ఆషాఢ మాసం బోనాలు చారిత్రాత్మక గోల్కొండ కోటపై ఉన్న జగదాంబిక ఎల్లమ్మ ఆలయం నుంచి ప్రారంభమవుతాయి. పదేండ్లుగా తెలంగాణ తొలి సీఎం కేసీఆర్ ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా జరిగిన బోనాల ఉత్సవాలు ఈ సారి ఎలా జరుగుతాయో? అని ప్రజలు సందేహాలు వెలిబుచ్చుతున్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడక ముందు అంతంతగా జరిగే బోనాల పండుగను తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డ తర్వాత తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ నేతృత్వంలో అంతర్జాతీయ స్థాయిలో పేరు ప్రఖ్యాతులు వచ్చే విధంగా నిర్వహించారు. ఆషాఢ మాసం బోనాలు గోల్కొండ కోటలో ఉన్న జగదాంబిక ఎల్లమ్మ ఆలయం నుంచి ప్రారంభమై తొమ్మిది వారాల పాటు జరిగి, ఇక్కడే పూర్తి అవుతాయి. ప్రతి ఆది, గురువారాల్లో జరిగే పూజలకు రాష్ట్ర నలుమూలల నుంచే కాక ఇతర రాష్ట్రాల వారు కూడా వచ్చి అమ్మవారిని దర్శించుకుని బోనాల రూపంలో మొక్కులు సమర్పించుకుంటారు. ఈ సారి ఆషాఢ మాసం బోనాలు జూలై 7న ప్రారంభం కానుండగా, ఇప్పటి వరకు గోల్కొండ కోటలో ఏర్పాట్లు ప్రారంభం కాలేదు. గత ఏడాది జూన్ 22వ తేదీన బోనాలు ప్రారంభమయ్యాయి. కానీ, ప్రభుత్వం 40 రోజుల ముందు నుంచే ఏర్పాట్లను ప్రారంభించింది. బోనాలు దగ్గర పడే కొద్ది అన్నీ ఏర్పాట్లు అధికారులు పూర్తి చేయడం జరిగింది. ఆలయానికి రంగులు మొదలు బోనాల ఊరేగింపు వరకు ఏర్పాట్లు చేస్తారు. ఇవన్నీ చేయాల్సి ఉండగా, ఆషా